క్లుప్తంగా

వేసవిలో ప్రత్యేక సేవలు



మజ్జిగ పంపిణీ చేస్తున్న జర్నలిస్టు యూనియన్ నేతలు

కడప కల్చరల్ : వేసవిని దృష్టిలో ఉంచుకుని కడప నగర వాసులకు ప్రత్యేక సేవలు అందజేయనున్నట్లు నగర ప్రముఖులు మారెడ్డి సురేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఆదివారం 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని నగర వాసుల సౌకర్యం కోసం కుటుంబ సభ్యులతో కలిసి మజ్జిగ పంపిణీ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ మాధవరెడ్డి, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెంకటరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాం, రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎం.బాలకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీనివాస్, ఏపీయూడబ్ల్యూజే నేతలు నాగిరెడ్డి, జిల్లా వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు, నగర ప్రముఖులు భూపతి రాయల్, సమ్మెట సత్యనారాయణ, లేవాకు కృష్ణారెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, మానవత సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీతో కీళ్ల మార్పిడి



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డాక్టర్ జహంగీర్‌బాషా

కడప రూరల్ : కడప నగరంలోని జేబీ ఆసుపత్రికి చెందిన డాక్టర్ జహంగీర్ బాషా ముంబైలో నిర్వహించిన రోబోటిక్ కీళ్ల మార్పిడి సదస్సులో కీలకోపన్యాసం చేశారు. ఆయన వెలిస్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జరీ లేటెస్ట్ టెక్నాలజీ కాన్ఫరెన్స్‌కు హాజరై విజయవంతంగా శిక్షణ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంబైలో జరిగిన కాన్ఫరెన్స్‌లో కీళ్ల మార్పిడి టెక్నిక్‌ను ప్రదర్శించడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వైద్య బృందంతో కలిసి పని చేయడం, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. కడప నగరంలో ఏర్పాటు చేసిన జేబీ ఆసుపత్రి ద్వారా రాయలసీమ వాసులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కీళ్ల మార్పిడిలో ప్రపంచంలోనే 40 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ చేత చేయబడిన అత్యాధునిక లేటెస్ట్ టెక్నాలజీ వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. నూతన సాంకేతిక విధానంతో 100 శాతం కచ్చితత్వంతో కూడిన మోకాళ్ల మార్పిడి సర్జరీలను చేస్తున్నట్లు వివరించారు. సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే విధంగా తక్కువ ధరకే వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. తమ ఆసుపత్రిలో లభించే అత్యాధునిక వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉర్దూ పోస్టులు యథావిధిగా కొనసాగించాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 300 తెలుగు, ఇంగ్లిష్ మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలలో సుమారు 50 ఏళ్లకు పైగా కొనసాగుతున్న ఉర్దూ భాష ఎస్జీటీ, ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు యథావిధిగా కొనసాగించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముస్తాఖ్ హుస్సేన్ కోరారు. వారు శనివారం సంయుక్తంగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. సంబంధిత పోస్టులను ప్రభుత్వం సర్ ప్లస్‌లో ఎలా చూపిస్తుందని విద్యాశాఖ అధికారులను వారు ప్రశ్నించారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తితో సంబంధం లేకుండా గత ఐదు దశాబ్దాలుగా వస్తున్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను రాత్రికి రాత్రి జీఓలు తెచ్చి ఎలా తొలగిస్తారని అన్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఆ పోస్టులన్నీ యథావిధిగా కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలోని ఏ జిల్లాలో లేని విధంగా అన్నమయ్య జిల్లాలో 20 ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలను డీ గ్రేడ్ చేసి ప్రాథమిక పాఠశాలలుగా మార్చేశారని, వెంటనే ఆ పాఠశాలలన్నింటికీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించి యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

నిర్లక్ష్యం నీడలో చరిత్ర..!

అపురూప శిల్పాలు, అలనాటి చరిత్రకు ప్రతీకలైన శిలాశాసనాలు, అరుదైన వస్తువుల లోగిళ్లుగా అలరారిన పురావస్తు శాల (మ్యూజియాలు)ను ఎవరూ పట్టించుకోవడం లేదు. నిర్వహణపై చిన్నచూపు చూడడంతో చరిత్రకు మసకబారుతోంది. జిల్లాలో రెండు ప్రాంతాల్లో మ్యూజియాలున్నాయి. పాలకుల నిర్లక్ష్యంతో వాటి స్థితిగతులు దయనీయంగా మారాయి. ఫలితంగా నేటి తరానికి ప్రాచీన చరిత్ర తెలుసుకునే అవకాశం లేకుండా పోతోంది.

- వారసత్వ సంపదకు రక్షణ కరువు
- శిథిలావస్థలో మ్యూజియం భవనాలు
- శిల్పాలు, శాసనాలు ఎండా, వర్షం పాలు
- నేడు అంతర్జాతీయ మ్యూజియం డే



మహావీర్ మ్యూజియం ప్రధాన హాలు

కడప కల్చరల్ : కడప నూతన కలెక్టరేట్‌లోని మ్యూజియం భవనం ఉండీ లేనట్లుగా ఉంది. కనీసం ఉద్యోగులైనా.. ఉంది, లేదని చెప్పలేరు. ఉనికికి కూడా నోచుకోని స్థితి నెలకొంది. నేడు అంతర్జాతీయ మ్యూజియం డే. ఇలాంటి వాటిని రక్షించుకుని భావి తరాలకు అందించాలన్నది ధ్యేయం. కానీ ప్రస్తుతం మ్యూజియంల స్థితిగతులు దయనీయంగా మారాయి. ఏటా మే 18న ఈ ఉత్సవాలు నిర్వహించుకుంటున్నారు గానీ రక్షణకు యత్నాలు లేవనే చెప్పాలి.

నిధులు అందుతున్నా..

జిల్లాలో రెండు ప్రాంతాల్లో మ్యూజియంలు ఉన్నాయి. మన పూర్వీకులు ఇలాంటి వాటిని దేశ వారసత్వ సంపదలుగా భావించి కాపాడుకునేందుకు కృషి చేస్తున్నారు. కానీ క్షేత్ర స్థితికి వచ్చేసరికి డొల్లగా కనిపిస్తోంది. రక్షణ కోసం సిబ్బంది ఉన్నా.. నిధులు అందుతూనే ఉన్నా.. స్థితి ఏమాత్రం మెరుగు పడటం లేదు. ఉన్నవన్నీ ఉనికి కోల్పోయి ఉన్నా.. భావితరాలకు అందే ఆశలు ఉన్నట్లు కనిపించడం లేదు. మన పూర్వీకులు ఎంతో శ్రమపడి అద్భుతమైన వారసత్వ సంపదను కూడగట్టి జాగ్రత్తగా మ్యూజియంలలో దాచారు. కానీ, వాటికి ఏమాత్రం రక్షణ లేదు. కడప కలెక్టరేట్‌లో పురాతన వస్తువులకు రక్షణ లభించే స్థితి లేదు. వాటి విలువ తెలిసినా రక్షణకు ప్రయత్నాలు సాగడం లేదు. కళ్ల ముందే కనుమరుగైపోతూ ఉన్న పరిస్థితిని గమనించి పురావస్తు ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో..

రాష్ట్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కడప, మైలవరంలో మ్యూజియంలు ఉన్నాయి. జిల్లాలోని నలుమూలల తవ్వకాలలో బయల్పడిన, విలువైన శిల్పాలు, శాసనాలను కడప నగరంలోని మహావీర్ మ్యూజియంలో చూడవచ్చు. అలాగే మైలవరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తవ్వకాలలో లభించిన శిల్పాలు, శాసనాలతోపాటు అరుదైన చారిత్రక సంపదను మైలవరం ప్రాజెక్టు సమీపంలో మ్యూజియం ఏర్పాటు చేసి అందులో ఉంచారు. భారీ సైజు వందాడి శాసనం నుంచి చిన్న శాసనాలు కూడా ఇందులో ఉన్నాయి.

ముక్కలవుతున్న శిల్పాలు

కడప నగరంలో మ్యూజియంను ఏర్పాటు చేసిన భవనమే నేడో, రేపో కూలేటట్లు ఉంది. అపురూపమైన శాసనాలకు ఏమాత్రం రక్షణ లేదు. దీంతో మ్యూజియంల ఏర్పాటు లక్ష్యం దెబ్బతింటోంది. కడప నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో 1982 జూన్ 8న భగవాన్ మహావీర్ మ్యూజియం పేరిట పురావస్తు సందర్శనశాలను ఏర్పాటు చేశారు. స్థానిక జైన సంఘాల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ భవనంలో జిల్లా నలుమూలల లభించిన అత్యంత విలువైన శిల్పాలు, శాసనాలు తదితర చారిత్రక వారసత్వ సంపదను ఈ మ్యూజియంలో ఉంచారు. ఏర్పాటు చేసి 43 సంవత్సరాలైనా ఇంత వరకు ఈ భవనాన్ని కాలానుగుణంగా ఆధునీకరించలేదు. దీంతో శిల్పాలను నిలిపిన పెడస్టల్స్ కూలిపోయి శిల్పాలు కిందపడి ముక్కలైపోతున్నాయి. కొత్త వస్తువులకు స్థలం లేక పోవడంతో మ్యూజియం బయట ముళ్ల కంపల్లోనూ, మ్యూజియం భవన శిథిలాలలో పడేసి ఉంచారు.

వర్షం వస్తే ఉరుస్తున్న భవనం

మ్యూజియంలో రాజుల వాడిన కత్తులు, నాణెలు, పురాతన వస్తువులు, ఈ ప్రాంతంలో బౌద్ధం, జైనం విలసిల్లిందనడానికి గుర్తుగా బుద్ధిని పాదాలు, జైన సంస్కృతిని తెలిపే శిల్పాలు కూడా ఉన్నాయి. వీటి రక్షణ కోసం ఏర్పాటు చేసిన మహావీర్ మ్యూజియం భవనం నేడు శిథిల స్థితికి చేరుకుంది. భవనంలో పలుచోట్ల తరుచూ పైకప్పు ఊడిపడుతూ శ్లాబ్ కడ్డీలు కనిపిస్తున్నాయి. మ్యూజియం కార్యాలయం కూడా అదే స్థితిలో ఉంది. వర్షం వచ్చినపుడు భవనం మొత్తం ఉరుస్తుండడంతో శిల్పాలను ఉంచిన కొయ్య పెడస్టల్స్ నాని కుళ్లిపోయి దెబ్బతిన్నాయి. దీంతో సిబ్బందితోపాటు సందర్శకులు కూడా భవనం పైకప్పు ఎప్పుడు ఊడి తమపై పడుతుందేమోనని భయపడుతున్నారు. మ్యూజియంను తెరిచినా తెరిచినట్లే కనపడదు. సంవత్సరాలు గడిచినా ఒక్కరు కూడా మ్యూజియం వైపు చూడడం లేదు. దారి సైతం మూసినట్లే ఉంది.



కడపలోని మహావీర్ మ్యూజియం

ఆధునికీకరణకు నోచుకోని వైనం

మైలవరం జలాశయం నిర్మాణ సమయంలో ఆ ప్రాంతంలో జరిగిన తవ్వకాల్లో పలు శిల్పాలు, శాసనాలు లభించాయి. నీట మునిగిన పలు దేవాలయాల్లోని శిల్పాలను కూడా రక్షించేందుకు మైలవరం జలాశయం పక్కన అతిథి గృహం ఆవరణలో పురావస్తుశాఖ మ్యూజియం ఏర్పాటు చేసింది. ఆ ప్రాంతాల్లో లభించిన శిల్పసంపద, శాసనాలు, జలాశయంలో ముంపునకు గురైన దేవాలయాల్లోని శిల్ప సంపదను, తవ్వకాలలో లభించిన పలు రకాల రాతి ఆకృతులను మ్యూజియంలో ఉంచారు. దీంతోపాటు బ్రిటీషు కాలంలో లభించిన నాణెలు, పలువురు రాజుల హయాం నాటి నాణెలు, ఆయుధాలు, నవాబులు గృహ నిర్మాణ సామగ్రి, రాజులు వాడిన కొన్ని పరికరాలు కూడా ఆసక్తి గొలుపుతున్నాయి. కానీ ఈ భవనాన్ని నిర్మించిన తర్వాత ఆధునీకరించకపోవడంతో ఈ మ్యూజియం భవనం కూడా శిథిలస్థితికి చేరుకోవడంతో సంవత్సర క్రితం మూసివేశారు.

మ్యూజియానికి ఆయువు పోద్దాం

మ్యూజియంల అంశం గురించి ఢిల్లీలో జరిగే ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో తప్పక చర్చిస్తాను. పాత కలెక్టరేట్, రెండు మ్యూజియంల పరిస్థితి కూడా దయనీయంగానే ఉంది. గట్టి ప్రయత్నం తప్పదు.

– లయన్ కె.చిన్నపరెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు, ఇంటాక్

వైవీయూలో స్వచ్ఛత కార్యక్రమం



వైవీయూ ఆవరణలో శుభ్రం చేస్తున్న వైవీయూ సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం యోగివేమన విద్యాలయంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఆర్ట్స్ బ్లాక్, గాంధీ పార్కు పరిసర ప్రాంతాల్లో ఉన్న పిచ్చి మొక్కలను, ప్లాస్టిక్‌ను తొలగించారు. ఈ సందర్భంగా నీటి ఆవశ్యకత, పొదుపు, పరిమిత వినియోగం గురించి అధ్యాపకులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో మోస్తరు వర్షం



కడపలో కురుస్తున్న వాన

కడప కార్పొరేషన్ : కడప నగరంలో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటలకు మొదలైన వాన మధ్య మధ్యలో విరామం ఇస్తూ సాయంత్రం వరకూ కొనసాగింది. వర్షం వల్ల రహదారుల్లో నీరు నిలిచింది. డ్రైనేజీ కాలువలు పొంగి ప్రవహించాయి. తీవ్రమైన వేడి గాలులతో ఉక్కిరి బిక్కిరి చేసిన వాతావరణం.. వాన రాకతో చల్లబడింది. దీంతో ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి



కార్యక్రమంలో పాల్గొన్న కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఇతర అధికారులు



మాట్లాడుతున్న కడప జోన్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ ధర్మతేజ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్‌లో పని చేస్తున్న భద్రతా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కడప జోన్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ ధర్మతేజ తెలిపారు. శనివారం వీఅండ్ఎస్ఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన జోన్ పరిధిలోని హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్రమత్తంగా ఉంటూ సంస్థ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ క్రమంలో ప్రతి సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. ఏ సమస్యలు వచ్చినా సిబ్బంది నేరుగా తమను కలిసి తెలియజేయవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భద్రతా అధికారులు కర్నూలుకు చెందిన తిరుపతిరావు, అనంతపురం విజయకుమార్, సత్యసాయి శ్రీనివాసరావు, కడప సలాం, జోనల్ వర్క్‌షాప్ మల్లికార్జునతోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలి



మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభిస్తున్న ఆర్డీఓ జాన్ ఇర్విన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రత, వేడి గాలుల నేపథ్యంలో వడదెబ్బ ప్రమాదం ఉన్నందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తహసీల్దార్ కార్యాలయంలో మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉష్ణోగ్రత అధికంగా ఉన్న కారణంగా తాను ఉదయం 9 గంటలకు కార్యాలయంలో అందుబాటులో ఉంటానని, తనను ఎవరైనా కలువవచ్చని తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు కూడా 12 గంటల్లోపు తమ పనులు ముగించుకుని వెళ్లాలన్నారు. తిరిగి సాయంత్రం 5 గంటల తర్వాత కూడా అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ప్రస్తుతం రీ సర్వే జరుగుతున్న కారణంగా సర్వేయర్లందరూ ఉదయం 7.30 గంటలకే పొలాల వద్దకు వెళ్లి విధుల్లో నిమగ్నమవుతారని, రైతులు వారికి సహకరించి సర్వే నిర్వహించుకోవాలని సూచించారు. కడప తహసీల్దార్ నారాయణరెడ్డి మాట్లాడుతూ మజ్జిగ, మంచినీటిని సౌకర్యాన్ని నెల రోజుల పాటు తమ కార్యాలయంలో అందుబాటులో ఉంచుతామన్నారు. చివరగా స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్రపై ప్రజల చేత ఆర్డీఓ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీప్రసన్న, సీనియర్ అసిస్టెంట్లు రత్నమ్మ, సౌజన్య, పద్మావతి, ఆర్ఐ ఈశ్వర్‌కుమార్, వీఆర్వోలు రవిశంకర్, భాస్కర్‌రెడ్డి, చలపతి, శ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత ఒడుగులు

కడప కల్చరల్ : కడప నగరంలోని నజీముల్ అమీన్ హైస్కూలులో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి బాలురకు ఉచితంగా ఉచితంగా వడుగులు (ఖత్నా) కార్యక్రమం నిర్వహించనున్నారు. పెద్దదర్గా దర్గా పీఠాధిపతి, అమీన్ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. వడుగులు చేయించుకున్న వారికి సంప్రదాయ వస్త్రాలు, గోధుమపిండు, చెక్కెర, నెయ్యితోపాటు మందులు కూడా ఉచితంగా అందజేయనున్నారు.

ఆ ఉపాధ్యాయులకు బదిలీల్లో న్యాయం చేయాలి

కడప ఎడ్యుకేషన్ : స్టడీ లీవ్‌లో వెళ్లిన ఉపాధ్యాయుల స్థానాన్ని 8 సంవత్సరాలు పూర్తి కాకుండానే బదిలీలలో చూపించ రాదని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కడపలోని ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 342 ప్రకారం ఎస్సీ, ఎస్టీ వారికి ప్రభుత్వం కల్పించిన ఎడ్యుకేషన్ లీవ్ విత్ పే అలవెన్సు కూడిన స్టడీ లీవ్‌కి వెళ్తే ఆ ఉపాధ్యాయుడు పని చేసే స్థానాన్ని ఖాళీ చూపించడం వల్ల.. స్టడీ లీవ్ తర్వాత జాయిన్ అయ్యేటప్పుడు తాను పని చేసే ప్లేస్ కోల్పోవడం సహజ సూత్రాలకు విరుద్ధమని అన్నారు. స్టడీ లీవ్ కాలంలో ఆ పాఠశాలకు తాత్కాలికంగా వర్క్ అడ్జస్ట్మెంట్ చేయాలని, స్టడీ లీవ్ అనంతరం అదే పాఠశాల ఆ ఉపాధ్యాయులకు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీఎఫ్ గౌరవ అధ్యక్షులు కోప్పూరి నాగరాజు, జిల్లా అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు శ్రీరాములు, రవిశంకర్, సలాం పాల్గొన్నారు.

హైపర్ టెన్షన్‌పై అప్రమత్తత అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : హైపర్ టెన్షన్ పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ప్రశాంత్ వర్ధన్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. శనివారం కడప నగరం నాగరాజుపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ శిక్షణ వైద్యులతో పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైపర్ టెన్షన్‌ను సాధారణ భాషలో బీపీ అంటారన్నారు. గతంలో వయసు పైబడిన వారికి మాత్రమే హైపర్ టెన్షన్ వచ్చేదని, ప్రస్తుతం యుక్త వయసు వారిలో కూడా కనిపిస్తోందన్నారు. సాధారణంగా బీపీ 120/80 డిసిబల్స్ ఉండాలని, 140/90 ఉంటే హైపర్ టెన్షన్ ఉన్నట్లుగా గుర్తించాలన్నారు. ఈ సమస్య ప్రాణాంతకం కాకపోయినప్పటికీ అనేక అనర్థాలకు దారి తీస్తుందన్నారు. ప్రధానంగా తల తిరగడం, ఒంటినొప్పులు, ఆకలి మందగించడం, వాంతి వచ్చేలాగా ఉండటం హైపర్ టెన్షన్ లక్షణాలన్నారు. ఈ సమయంలో నిర్లక్ష్యం చేస్తే గుండెజబ్బులు, పక్షవాతం వచ్చే ప్రమాదం ఉందన్నారు. విచ్చలవిడిగా జంక్ ఫుడ్స్ తీసుకోవడం, ఆల్కహాల్ తరుచూ సేవించడం, శారీరక శ్రమ లేని వారికి, ఎక్కువ మాంసాహారం తీసుకునే వారికి, మానసిక ప్రశాంతత లేకుండా విపరీత ఆలోచనలు చేస్తూ, ఈర్ష ద్వేషాలకు లోనయ్యే వారికి హైపర్ టెన్షన్ వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి రోజు శారీరక శ్రమ, నడక, వ్యాయామం, యోగా, ధ్యానం లాంటివి చేసినట్లయితే హైపర్ టెన్షన్‌కు దూరంగా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డాక్టర్లు ముస్కాన్, సోనూశాలెహ, ప్రియదర్శిని, పీజీ డాక్టర్స్ లహరి, జ్యోతి, కారుణ్య, డాక్టర్ విజయ్, బ్లెస్సిన్ రాజా, ఏఎన్ఎం లక్ష్మీదేవి, ఆశా వర్కర్ నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బేల్దారి మృతి

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో అక్కాయపల్లెలో ఓ ఇంటికి బేల్దారు పని చేసేందుకు వచ్చిన శీలన్న (36) ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడి మృతి చెందాడు. ఈ సంఘటనపై కడప తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. కర్నూలు జిల్లాకు చెందిన శీలన్న పనుల కోసం వచ్చి కడపలో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం పని కోసం వెళ్లి మృత్యువాత పడ్డాడు.

విద్యారంగాన్ని తిరోగమనం వైపు తీసుకెళ్లవద్దు



నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు

కడప ఎడ్యుకేషన్ : విద్యారంగాన్ని తిరోగమనం వైపు తీసుకెళ్లవద్దని కడప జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ప్రభుత్వానికి సూచించింది. కడప నగరం యూటీఎఫ్ భవనంలో శనివారం ఎస్టీయూ కడప జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా అధ్యక్షతన ఉపాధ్యాయ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలుగా విద్యాశాఖ చర్చల పేరుతో ఉపాధ్యాయ సంఘాలను మభ్యపెట్టిందన్నారు. జీవో 117 రద్దు చేయమన్నాము కానీ మరలా తరగతుల విలీనం కోరలేదని, ప్రభుత్వం ప్రకటించిన 9 రకాల పాఠశాలలు తమకు అంగీకారం కాదన్నారు. అలాగే ఉన్నత పాఠశాలల్లో తరగతికి 40 మంది విద్యార్థుల చొప్పున ఉపాధ్యాయులను కేటాయించడం శాస్త్రీయత అని తరగతికి 53 మందిని అంగీకరించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. పీఆర్‌టీయూ నాయకులు శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఐక్యవేదిక ఉద్యమ కార్యాచరణలో భాగంగా విద్యాశాఖ తిరోగమన నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఈనెల 21 వ తేదీన చేపట్టనున్న డీఈఓ కార్యాలయ ముట్టడిని జిల్లాలోని ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాలెం మహేష్ (యూటీఎఫ్), పి.ఖాదర్ బాషా(ఏపీటీఎఫ్ 257), ఆర్.అబ్దుల్లా (ఏపీటీఎఫ్ 1938) వెంకటరామిరెడ్డి(అపస్), ఎం.వి సుబ్బారెడ్డి (ప్రధానోపాధ్యాయ సంఘం), సయ్యద్ ఇక్బాల్ (రూటా), ఎస్.రమణారెడ్డి (వైఎస్ఆర్‌టీఎఫ్), జి.శ్రీనివాసులు (ఆర్జేయూపీ), ఎం.ప్రవీణ్ కుమార్(ఎస్ఏపీఈ అసోసియేషన్), ఎం.శివార్జున (ఎస్సీఎస్టీయూఎస్), హరి కొండయ్య (బీటీఏ), ఎస్.నజీర్‌బాషా(ఐటా), సీవీ ప్రసాద్ (ఏపీటీఎఫ్ అమరావతి), రాష్ట్ర నాయకులు కె.సురేష్ బాబు, బి.లక్ష్మీరాజా, కె.బాలగంగిరెడ్డి, జి.తిరుపాల్, బి.రమణమూర్తి, చంద్రమోహన్, పి.బాలకృష్ణ, గంగరాజు, అబ్దుల్ రజాక్, సిరాజుద్దీన్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్‌తో లాజిక్‌ను గమనించాలి



ఇంద్రజాలాన్ని ప్రదర్శిస్తున్న సమీర్‌బాషా

కడప కల్చరల్ : మ్యాజిక్ అన్నది విలక్షణమైన ప్రక్రియ అని, దాన్ని సాధన చేసినపుడే వినూత్నమైన అభిరుచి ఏర్పడుతుందని ప్రముఖ ఇంద్రజాలకుడు సమీర్‌బాషా అన్నారు. కడప జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి సెలవుల సందర్భంగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా శనివారం సమీర్ బాషా ఆధ్వర్యంలో మ్యాజిక్ శిక్షణ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన విద్యార్థులకు ఆకర్షణీయమైన మ్యాజిక్ ట్రిక్స్ ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ప్రదర్శనల వెనుకగల శాస్త్రీయ కారణాలను వివరిస్తూ విద్యార్థుల్లో విజ్ఞానంపై ఆసక్తిని పెంచేందుకు కృషి చేశారు. ఈ సందర్భంగా చెక్కెరను చాక్లెట్లుగా మార్చడం, అగ్గిపెట్టెలో ఉన్న ఐదు రూపాయల నాణెంను మాయం చేయడం, చేతిలో మంటలు వెలిగించడం వంటి గమ్మత్తులను ప్రదర్శించి ఆసక్తిని పెంచారు. వీటితోపాటు పలు ట్రిక్స్‌లను వారికి పరిచయం చేసి వినోదంతోపాటు శాస్త్ర విజ్ఞానాన్ని అందజేశారు. గంథాలయ సెక్రటరీ అమీరుద్దీన్ ప్రత్యేక అతిథిగా హాజరై పిల్లలలో ఉత్సాహాన్ని మరింత పెంచేందుకు కృషి చేశారు. వారిలోని పరిశీలన శక్తిని ప పెంచడమే కాకుండా శాస్త్రీయతను కూడా గమనించేలా ప్రోత్సహించారు. ఈ తరగతులు విద్యార్థుల పరిశీలన శక్తిని పెంచడమే కాకుండా విజ్ఞానాన్ని ఆచరణాత్మకంగా అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ సుబ్రమణ్యం, భారతి గ్రంథాలయ సిబ్బంది పవన్, జేమ్స్, గౌస్, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం మరియాపురం సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 1977–1978 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కడప నగరం ఐఎంఏ హాలులో పాఠశాల అప్పటి ఎస్పీఎల్ కోనేటి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యా బుద్ధులు నేర్పించిన గురువులు జోజిరెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయుడు ఇలియాస్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. అనంతరం జోజిరెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇలియాస్‌రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలిగి, జీవితంలో పైకి వచ్చిన విధానాన్ని చూసి అభినందించారు. కోనేటి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 50 మంది పూర్వపు విద్యార్థులు రావడం సంతోషదాయకమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బి.రమణ గుప్తా, శివ మోహన్, నాగేంద్ర ప్రసాద్, వి.రవీంద్ర ప్రసాద్, రాజు శేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే, కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్ : అధికారులు వినూత్నమైన ఆలోచనలతో, సృజనాత్మక రీతిలో ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఎన్ వరదరాజుల రెడ్డి సంయుక్తంగా అధికారులకు సూచించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ప్రొద్దుటూరు డ్రైనేజీ వ్యవస్థ, కమర్షియల్ మార్కెట్ యార్డ్ అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు డ్రైనేజీ వ్యవస్థను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. వినూత్న ఆలోచనలతో ప్రణాళిక బద్ధంగా ప్లాన్ తయారు చేసి అంచలంచెలుగా పనులను పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పనులు చేపట్టాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థను ఇంకా మెరుగు పరచాల్సి ఉందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏ మేరకు నిధులు అవసరమవుతాయో అంచనాలు తయారు చేసి నిర్దేశించిన ఆదేశాలు, సూచనలను పాటించాలన్నారు. ప్రస్తుతం తయారు చేసిన నమునాల్లో కొన్ని మార్పులు చేయాల్సి ఉందన్నారు. ప్రొద్దుటూరును జోన్ల వారీగా విభజించి ఒక్కొక్కటిగా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పనిలోనూ నియమ నిబంధనలను పాటించాలన్నారు. అలాగే ప్రొద్దుటూరులో కమర్షియల్ మార్కెట్ యార్డ్‌ను అధునాతనంగా నిర్మించాలని, కూరగాయలు, నిత్యావసర వస్తువులు, ఇతర వ్యాపారాల షాపులతోపాటు బంగారు నగల షాపులు కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అధికారులు అందరూ సమన్వయంతో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని అన్నారు. ప్రస్తుతం ప్రొద్దుటూరు పట్టణంలో ఎన్ని గృహాలు ఉన్నాయని, ఎంత జనాభా ఉందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రొద్దుటూరు పట్టణ ప్రాంతంలో జనాభా అతివేగంగా పెరుగుతోందని, అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితి సింగ్, జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ, ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, టీడీపీ నాయకుడు శివారెడ్డి, తహసీల్దార్ గంగయ్య, మున్సిపల్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి